
రాక్షసుడు,

బొమ్మల అమ్మకం




రాక్షసుడు,

బొమ్మల అమ్మకం



ఒక రోజు రాక్షసుడు, చిన్న పిల్లవాడు కుర్చీలో కూర్చుని వార్తా పత్రిక చదువుతున్నారు. ఒక సినిమాకి వెళ్లాలన్న ఆలోచనలో వాళ్లు ఉన్నారు. అంతలో వాళ్లకి ఒక ప్రకటన కనిపించింది: “బొమ్మల అమ్మకం". అంటే తక్కువ ధరలకే బొమ్మలు కొనుక్కోవచ్చు. చవకలో కొనుక్కోటానికి ఇదే అవకాశం. అక్కడ కొన్ని బొమ్మలు చాలా చవకగా దొరకొచ్చు.

మంచి బొమ్మలు కొనుక్కోటానికి అక్కడికి వెళ్లాలని రాక్షసుడు, చిన్న పిల్లవాడు నిర్ణయించుకున్నారు.





వాళ్లిద్దరూ కోటు వేసుకుని తయారయ్యారు. రాక్షసుడు తన మాయల గొడుగు, మఫ్లరు తీసుకున్నాడు. బయట చలి పెరిగే అవకాశం ఉంది కాబట్టి అతడు మఫ్లరు తీసుకున్నాడు.

బొమ్మల దుకాణానికి వెళ్లాలన్న తొందరలో రాక్షసుడు, చిన్న పిల్లవాడు ఉన్నారు. వాళ్లు సైకిలు మీద బయలుదేరారు. చిన్న పిల్లవాడిని రాక్షసుడు ముందు కడ్డీ మీద కూర్చోబెట్టాడు. "బొమ్మల దుకాణానికి పద," అని రాక్షసుడు అన్నాడు.




రాక్షసుడు, చిన్న పిల్లవాడు మలుపు తిరిగేసరికి ట్రాఫిక్ జాం లో చిక్కుకునిపోయారు. ట్రాఫిక్ లైట్లు పని చెయ్యటం లేదు. అన్నివైపులా ఎరుపు రంగే ఉండి మారటం లేదు. కారులు అన్నీ ఆగిపోయి ఉన్నాయి.

అందరూ హారను మోగిస్తూ, కేకలు వేస్తున్నారు.

“తొందరగా పదండి. మేం ముఖ్యమైన పనుల మీద ముఖ్యమైన ప్రదేశాలకు వెళ్లాలి. ఇక్కడే ఏళ్లూ, పూళ్లూ గడిచిపోతే ఎలా," ఒక వ్యక్తి పెద్దగా అరుస్తున్నాడు.

అందరూ పనికి వెళ్లే హడావిడిలో ఉన్నారు. అంతా గందరగోళంగా ఉంది. ఎవరో ఒకరు పూనుకోకపోతే వాళ్లు ఆ రోజు అసలు పనికి వెళ్లలేరు.




ట్రాఫిక్ జాం మధ్యకి రాక్షసుడు చేరుకున్నాడు. తన సైకిలు పక్కన పెట్టాడు. మనుషులు ముఖ్యమైన ప్రదేశాలకు వెళ్లకపోతే ఎలా అని అతను అనుకున్నాడు.



అందరికీ కనపడేలా రాక్షసుడు తన గొడుగుని పైకి ఎత్తాడు. ఇక ట్రాఫిక్ పోలీసు బాధ్యతలు తీసుకున్నాడు. కారులకు ఆదేశాలు ఇవ్వటానికి తన గొడుగుని ఉపయోగించాడు. కదలవలసిన కారులకు గొడుగు ఊపటంతో అవి కదలసాగాయి. మిగిలిన కారులను ఆగమని సంకేతం ఇచ్చాడు.


అతడు గొడుగు ఊపితే అటువైపు కారులకు “వెళ్లండి" అని అర్థం. చెయ్యి ఎత్తితే ఆ వైపు కారులకు "ఆగండి" అని అర్థం. ఎప్పటికప్పుడు అతడు తన ఆదేశాలను మారుస్తున్నాడు. అప్పుడు వెళుతున్న కారులు ఆగాలి, ఆగిన కారులు వెళ్లాలి.





అతడి ప్రయత్నం పని చేసింది. ట్రాఫిక్ జాం తొలిగిపోతోంది. ట్రాఫిక్ పోలీసు లాగా రాక్షసుడు పని చేస్తున్నాడు.

ఇప్పుడు వాహనాలు వేగంగా వెళుతున్నాయి. తాము వెళ్లాల్సిన ప్రదేశాలకు మనుషులు వెళుతున్నారు. అంతకుముందు కోపంగా, అసహనంగా ఉన్నవాళ్లు ఇప్పుడు ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నారు.





రాక్షసుడు పొడవుగా ఉండి అందరికి కనపడతుండటంతో కూడా అతడు సహాయ పడగలిగాడు.
అతడు చెయ్యి ఊపినప్పుడు అందరికి అది కనిపించేది.

లైట్లు బాగు చేసే వ్యక్తి వచ్చేవరకు రాక్షసుడు వాహనాలను నియంత్రిస్తూ ఉన్నాడు. లైట్లను బాగు చెయ్యటం ఎంతో సేపు పట్టలేదు. బాగు చేసే వ్యక్తి లైట్లను సరిచెయ్యటంతో ఎరుపు, పసుపు పచ్చ, ఆకుపచ్చ లైట్లు మళ్లీ వెలగటం మొదలుపెట్టాయి.


రాక్షసుడు, చిన్న పిల్లవాడు తమ సైకిలు ఎక్కారు. బొమ్మలు కొనుక్కోవాలన్న ఉత్సాహంతో వాళ్లు తగ్గింపు ధరలకు అమ్మకాలు ఉన్న దుకాణం వైపు వెళ్లారు.



చివరికి వాళ్లు ఆ దుకాణానికి చేరుకున్నారు. అక్కడ ఆపాటికే చాలామంది ఉన్నారు.

“అద్భుతమైన బొమ్మల అమ్మకం, ఈ రోజే!” అన్న ప్రకటన కిటికీలో ఉంది.

రాక్షసుడు, చిన్న పిల్లవాడు చాలా విచారంగా ఉన్నారు. లోపలికి వెళ్లటానికే జనాలు బారులు తీరి ఉన్నారు. లోపల జనాలు గుంపులు, గుంపులుగా ఉన్నారు. వాళ్లు లోపలికి చేరుకునేసరికి తమకు కావలసిన బొమ్మలు అయిపోవచ్చు.



చాలాసేపటికి రాక్షసుడు, చిన్న పిల్లవాడు దుకాణంలోకి వెళ్లగలిగారు. లోపల చాలా మంది ఉండేసరికి ఎవరైనా తేలికగా తప్పిపోవచ్చు.

చుట్టూతా ఏం జరుగుతోందో చూడటానికి, తప్పి పోకుండా ఉండటానికి చిన్న పిల్లవాడు రాక్షసుడి భుజాల మీదకి ఎక్కాడు.





తన కోటు ఎవరో లాగినట్టు రాక్షసుడికి అనిపించింది. చిన్న పిల్లవాడికి ఏవో మాటలు కూడా వినిపించాయి. అతడు కిందకి చూశాడు. అక్కడ ఒక పాప ఉంది. రాక్షసుడి కోటు పట్టుకుని ఉంది. ఆ పాప ఏడుస్తోంది. వాళ్ల నాన్న నుంచి ఆ పాప తప్పిపోయింది. బొమ్మలు చూస్తుండగా అతడు వేరే బొమ్మల వైపుకి వెళ్లినట్టు ఉన్నాడు. ఇప్పుడు అతను ఎక్కడా కనపడటంలేదు.




రాక్షసుడు దుకాణం అంతా కనపడేలా ఆ పాపను పైకి ఎత్తాడు. ఆ పాప నాలుగు వైపులా చూసింది. దుకాణం మొత్తం చూసింది.

చివరికి ఆమెకి వాళ్ల నాన్న కనిపించాడు. అతడు కింద కూర్చుని విమానాలు, రైళ్లతో ఆడుకుంటూ ఉన్నాడు. పాపకి నాన్న కనపడటంతో, “ధన్యవాదాలు, రాక్షసుడా," అంది.



అప్పుడు ఒక అమ్మ కనపించింది. ఆమె విచారంగా ఉందనిపించింది. బహుశా ఆందోళనతో ఉందేమో. ఆమె కొడుకు కనపడటం లేదు. “అతను ఎక్కడ ఉన్నాడో తెలియటం లేదు. అతడివి గోధుమ రంగు కళ్లు, అదే రంగు జుట్టు. నీలం రంగు చొక్కా, ఎర్ర రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడు,” అని ఆమె చెబుతోంది.



అక్కడ ఉన్న మనుషుల గుంపుల మధ్య ఆ అబ్బాయి కోసం రాక్షసుడు, చిన్న పిల్లవాడు వెతకసాగారు.




చివరికి వాళ్లకి ఆ పిల్లవాడు కనిపించాడు.
అతడు తోలుబొమ్మలతోటి ఆడుకుంటున్నాడు.
“అడుగో మీ అబ్బాయి," అని రాక్షసుడు చెప్పాడు.
తల్లి సంతోషించింది, “ధన్యవాదాలు, రాక్షసుడా,"
అని చెప్పింది.





చాలా ఎత్తుగా ఉండటం వల్ల కనపడని వాళ్లని రాక్షసుడు బాగా వెదక గలుగుతున్నాడు. దుకాణం చాలా పెద్దది కావటం, చాలా మంది ఉండటం వల్ల ఇతర మనుషులు అంతా చూడలేక పోతున్నారు.

కానీ రాక్షసుడికి మొత్తం కనపడుతోంది. దాంతో అందరూ అతడిని ప్రశ్నలు అడగసాగారు. ఎటు వెళ్లాలి, ఫలానా బొమ్మలు ఎక్కడ ఉన్నాయి అని అతడిని అడుగుతున్నారు. ఇప్పుడు దుకాణంలో రాక్షసుడు ట్రాఫిక్ పోలీసు లాగా ఉన్నాడు. అయితే కార్లకి కాకుండా ఇప్పుడు మనుషులకు దారి చూపిస్తున్నాడు. ఈ పనిలో చిన్న పిల్లవాడు కూడా అతడికి సహాయం చేస్తున్నాడు.



అయితే రాక్షసుడు ఏ బొమ్మలు కొనలేకపోతున్నాడు. తప్పిపోయిన వాళ్లని, కనపడని వాళ్లని వెదకటమే అతడికి సరిపోతోంది. మొదట అతడు పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారో చెప్పాడు. ఇప్పుడు ఏ బొమ్మలు ఎక్కడ ఉన్నాయో చెప్పి సహాయపడుతున్నాడు. రైలు బొమ్మలు, ఆట బొమ్మలు, సైకిళ్లు, తోలుబొమ్మలు వంటివి ఎక్కడ ఉన్నాయో అందరూ అడుగుతున్నారు.

ఎవరు ఎటు వెళ్లాలో రాక్షసుడు చెపుతూ ఉన్నాడు. అతడే దుకాణానికి యజమాని అని అందరూ అనుకోసాగారు.

రాక్షసుడు చాలా పొడవుగా ఉండటం వల్ల అందరి తలల పైనుంచి చూసి సహాయపడ గలుగుతున్నాడు.



కొంచెం సేపటికి దుకాణానికి వచ్చిన వాళ్లు ఒక్కొక్కరు వెళ్లిపోసాగారు. వాళ్ల చేతుల్లో బొమ్మలతో సంచులు, ప్యాకెట్టులు ఉన్నాయి.


“ధన్యవాదాలు, రాక్షసుడా," వెళుతున్న వాళ్లు చెప్పసాగారు. దుకాణ యజమాని అతడే అని వాళ్లు అనుకోసాగారు.

“దుకాణం మూసేసే సమయం అయ్యింది," అంటూ దుకాణ యజమాని కూడా అతడికి ధన్యవాదాలు చెప్పాడు.



తక్కువ ధరలకు బొమ్మలు కొనుక్కోలేక పోయినందుకు రాక్షసుడు, చిన్న పిల్లవాడు బాధ పడ్డారు. “మనం ఏదైనా కొనుక్కుందామని వచ్చాం. మొదట కారుల కోసం ట్రాఫిక్ పోలీసుగా పని చేశాం. తరవాత ఇక్కడ వాళ్లకు సహాయం చేశాం. మన కోసం మనకి సమయమే లేకుండా అయిపోయింది. మన కోసం ఒక్క బొమ్మ కూడా కొనుక్కోలేకపోయాం. ఇప్పుడు వెళ్లిపోయే సమయం అయ్యింది..." చిన్న పిల్లవాడు అన్నాడు.

రాక్షసుడు, చిన్న పిల్లవాడు సైకిల్ తొక్కుకుంటూ విచారంగా ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు.





బుడగ పట్టుకుని రాక్షసుడు, చిన్న పిల్లవాడు ఇంటికి చేరుకున్నారు.

చివరికి అంతా బాగా జరిగింది!

బుడగలు అమ్ముతున్న ఒక వ్యక్తిని రాక్షసుడు, చిన్న పిల్లవాడు చూశారు. “మనం ఒక బుడగ కొనుక్కుందాం," అన్నాడు రాక్షసుడు.
చిన్న పిల్లవాడికి ఈ ఆలోచన నచ్చింది. వాళ్లిద్దరు కలిసి తమకి ఇష్టమైన రంగులో ఉన్న ఒక పెద్ద బుడగని ఎంచుకున్నారు. ఇంటికి తీసుకెళ్లటానికి ఇప్పుడు వాళ్ల దగ్గర ఒక ఆట వస్తువు ఉంది. “ఇది నాకు నచ్చింది," చిన్న పిల్లవాడు అన్నాడు.



అయిపోయింది